# ఈవ్ మళ్ళీ చచ్చిపోయింది

అవును ఈవ్ చచ్చిపోయింది. నేనే చంపేశాను. ఒకప్పుడు తల్లిని చంపిన పరశు రాముణ్ణి పదిరకాలుగా తిట్టిన నేను ఇప్పుడు ఆడ పరశురాముణ్ణి అమ్మని ముచ్చటగా ఆది మానవి అని పిలుచుకునే దాన్ని. అయ్యో నేనే ఇప్పుడు ఆ అమ్మనీ, ఈవ్‌ని చంపేశాను.

ఈనోటితో, ఈ మాటల్తో చంపేశాను! నువ్వింకా పురాణయుగంలోలాగా మౌనంగా వుంటే కుదరదన్నాను. ప్రశ్నించడం చేతకాకపోతే సమాధానం దొరకదన్నాను. ఇప్పటికయినా నేర్చుకోకపోతే ఏ కాస్త విషం అయినా మింగమన్నాను. 'ఈవ్' ఆధునిక స్త్రీలాగే రోషపడింది.

అయ్యో అమ్మా! ఇప్పుడు ఈ వయసులో ఇదేమిటమ్మా! ఈ పని నువ్వెప్పుడో చేసుండాల్సిందే!

నిన్నీ భూమ్మీదికి తెచ్చిన హడావిడిలో మీ అమ్మ చెప్పకుండా వెళ్లిపోతే నీ దురదృష్ట జాతకాన్ని తిట్టుకుంటూ కూర్చోకుండా అప్పుడే ఎవరయినా నీ నోట్లో ఓ వడ్ల గింజ

వేసుండాల్సింది. నిన్ను సాకడమనే సాకుతో మీ నాన్న రెండో పెళ్లి చేసుకున్నపుడూ నీ సవతి తల్లికి నువ్వు కంట్లో నలుసువయినపుడూ చావు దెబ్బలూ, తిట్లూ అలవాటే కదమ్మా!

చదువూ, సంధ్యా లేకండా ఇంటిచాకిరీతో నువ్వు సతమతమవుతూంటే నిన్ను స్వర్గపు అంచులకు తీసికెళ్తానంటూ జీవితపు శిఖరాల మీద నిలబెడ్తానంటూ వాగ్దానాలు చేసిన నీ వాడనుకున్నవాడు... లక్షల కట్నం కోసం అర్థాంతరంగా నీ చేతిని ఒదిలేసినపుడు ఆ పసిమనసుతోనే ఒంటరి అఘాతాన్ని తట్టుకున్నావు కదమ్మా!

ఎదురుకట్నం కోసం నీ సవతి తల్లి నీ గొంతు కోసినపుడయినా నువ్వు బదులు పలికావా?

పెళ్ళయిన మూడో రోజే పేకాటకని వెళ్లిన నీ మొగుడు తెల్లవారుఝామున తిరిగొచ్చి నపుడు ఇదేమిటని నువ్వు నవ్వుతూ ప్రశ్నించబోతే విసుక్కుని నీకు ప్రశ్నించే హక్కులేదని బోధపరిచినపుడూ ఎలా వూరుకున్నావమ్మా మౌనంగా.

నేను కడుపున పడినపుడు నీనుండి సుఖం లేదనే సాకుతో అతగాడు రోజుల తరబడి బయటే తిరిగినపుడే చేసుండకూడదామ్మా! ఈ పని... మనిద్దరం బతికిపోయుండే వాళ్ళం కదా?

ఇప్పుడెందుకు చేశావమ్మా ఈ పని, ఈ పిచ్చిపని?!

అతడు వద్దని శాసించిన ఆడపిల్లనే కన్నందుకు చాలా రోజులు పుట్టింటి కంకితమయి పోయావే.

అభిమానాన్ని చంపుకుని రోజులు వెళ్లబుచ్చావే!

మీ అన్నయ్యల అసహనాన్నీ, వదినల ఆరళ్లనీ భరించడానికప్పుడు చిరునవ్వుని అరువు తెచ్చుకున్నావు కదామ్మా?

అప్పుడంతా బిగపట్టుకున్న దానివి ఇప్పుడూ అలాగే భరించలేకపోయావా?

ఇంట్లో నువు లేకపోతే జరక్క, అతడొచ్చి నిన్ను రమ్మంటే చంకలు గుద్దుకుంటూ నన్ను భుజానేసుకుని వెళ్లావే!

మీ మామయ్య కొడుకొస్తే క్షేమ సమాచారాలడిగావని రంకు అంటించి, గొడ్డును బాదినట్టు బాదినపుడయినా నువ్వు 'ఊ' అన్నావా?

మీ పక్కింటబ్బాయి ఏదో పనిమీద ఈవూరొచ్చి నిన్ను చూడ్డానికొచ్చినపుడు మాత్రమో?

ఎవరితోనమ్మా అతడు రంకు అంటగట్టనిది?

నా మార్కులు తెలుసుకోవడానికి బడికొస్తే అయ్యోరితో రంకు.

అతడింట్లో లేనపుడు గ్యాసొస్తే సప్లయర్‌తో రంకు.

మనకెవరూ రాసే వాళ్ళులేరనుకో, ఎప్పుడో నూటికీ కోటికీ ఒక జాబొస్తే పోస్ట్‌మ్యాన్‌తో రంకు.

పక్కింటాయన తాళాలడిగితే అతడితో రంకు.

ఉదయాన్నే రంకు అంటించి చావగొట్టి రాత్రి పక్కలోకి రమ్మంటే మొగుడితో నవ్వుతూనే బతికావు కదా ఇన్నేళ్ళు!

ఇప్పుడేమయిందమ్మా నీకు?

అయ్యో అమ్మా ! నేనే నిన్ను చంపుకున్నట్లున్నానే!

ఈ మునిమాపు వేళలో నేనే నీకు ప్రశ్నించడం నేర్పబోయాను. నా వేలితోనే నా కన్ను పొడుచుకున్నాను!

నువ్వు లేకుండా నేనెలా బతకనమ్మా? నాకు నువ్వు కావాలమ్మా.

అమ్మా నీకేనాడయినా కాలునొచ్చినా, కన్ను నొచ్చినా, జ్వరమొచ్చినా వాడు పట్టించుకున్నాడా?

అంట్లుతోముకుంటూ ఇల్లలుక్కుంటూ బతికేదానివని గదా, నువ్వంటే అతడికి లోకువ. అదే అతడు తాగొచ్చి పడిపోతే నువు సేవలకు సిద్ధమయిపోతావు. ఏడ్చుకుంటావు. దిగులు పడతావు. రెండు చేతులూ ఎత్తి కనిపించని దేవుణ్ణి ప్రార్థిస్తావు. అదే జీవితమంటావు.

నువ్వెప్పుడూ ఆత్మీయతా స్పర్శలేని బీటలు వారిన నదివేకదా ఇప్పుడేమిటమ్మా ఇది కొత్తగా?

ఒళ్ళు మండిన సంఘటనల్లో నేనెప్పుడయినా నాన్నని ద్వేషిస్తే "ఛ! అలా అనకూడదు నిత్యా! నాన్న చాలా మంచివారు. కాకుంటే కొంచెం కోపమెక్కువ. కొంచెం తాగుతారు. కొంచెం తిరుగుతారు. మగాడికామాత్రం అహం సర్వసాధారణం. మనమే సర్దుకు పోవాలి తల్లీ. భార్యాభర్తల్లో ఆ మాత్రం సర్దుబాటు లేకపోతే సంసారమెలా గడుస్తుంది? అయినా ఆడదానికి పట్టువిడుపు లుండాలి" అంటూ నాకు నచ్చచెప్పపోయేదానివి.

"ఏం ఆడదానికి మాత్రమే ఎందుకుండాలి. మగాడికక్కర్లేదా పట్టువిడుపులు" అన్న నా ప్రశ్నని దాటేసేదానివి.

నువ్వు నిజంగా భూదేవివమ్మా, మట్టికెక్కడయినా కోపమొస్తుందా.

ఎంత సహనం లేకపోతే నీకు తెలీకుండా ఓ అర్ధరాత్రి తన పై ఆఫీసర్ని నీ పడగ్గదిలోకి పంపినపుడూ, వాడు ముళ్ళపందిలా నీ మీదపడి నిన్ను లొంగదీసుకోవడానికి ప్రయత్నించి నపుడూ, వాడితో పెనుగులాడి మౌనంగా బయటకొచ్చావే గానీ, అప్పుడయినా ఇదేమిటని ప్రశ్నించావా? నీ మొగుణ్ణి చంపడానికి ప్రయత్నించావా?

అబ్బే నువ్వు మహా పతివ్రతవి కదా? సీతకీ, సావిత్రికీ, సుమతికీ వారసురాలివి గదా?

నీ గదిలో నీబెడ్‌మీద, అతడు బజారు మనుషుల్ని తీసుకొచ్చి పండబెడితే ఎట్లా ఓర్చుకున్నావమ్మా?

అంతటి దు:ఖాన్ని దిగమింగుకుని నీ గుండె పగిలిపోకుండా ఎట్లా వుండగలిగింది? అయ్యో అది అప్పటికే ముక్కలు చెక్కలుగా చీలిపోయిందా?

అతడి పేకాట ఫ్రెండ్స్‌కి నీ ఇష్టం, నా ఇష్టం లేకుండానే హరిశ్చంద్రుడు భార్య నమ్మేసినట్లుగా నన్నిచ్చి పెళ్ళి చేసేస్తే దు:ఖాన్ని గుండెల్లోనే దాచుకున్నదానివి.

అతడికి నీ శరీరంతోనూ, మనసుతోనూ ఆడుకోవడమైతే తెలుసుకానీ నీ గుండెల్లోని దు:ఖాన్ని చదవడం తెలీదు.

దుర్మార్గుడు...

ఆ మాటంటే మళ్లీ నీక్కోపమొచ్చేస్తుంది. నువ్వెంత మంచిదానివమ్మా? నిన్ను ద్వేషించే వాళ్ళనీ, హింసించేవాళ్లనీ కూడా ఎంత నిండుగా ప్రేమిస్తావు ? నీ గుండెల్లో ప్రేమ తప్ప మరేమీ లేదా? గంపెడు దు:ఖం ఎక్కడ దాచావు?

తమ్ముడు సత్య. పదిహేడేళ్ళకే పనికిమాలిన చదువొదిలేసి పక్కూరి స్రవంతితో లేచి పోయినపుడు పక్షికి రెక్కలొచ్చేశాయని నువ్వు కుమిలిపోతూ వుంటే ఎట్లా పెంచావీ కొడుకు నంటూ ఊరంతా నీ మొహం మీద ఉమ్మేస్తూంటే...

ఎక్కడ దాచుకున్నావమ్మా అవమాన రేఖలు నిండిన నీ ముఖాన్ని?

ఏ కన్నతల్లయినా సరే కొడుకుని పరాయమ్మ కన్నబిడ్డని లేపుకు పొమ్మని సలహా ఇస్తుందా? నువ్వొక ముద్ద అన్నం తినబోతే ఎట్లా సయిస్తోందే నీ కడుపుకి? అంటూ నీ అత్తా, మొగుడూ నీచేతిలో ప్లేటు లాగేసినపుడూ అప్పుడెప్పుడూ రాని రోషం ఇప్పుడెందుకొచ్చిందమ్మా? అయ్యో నా తల్లీ ఎంత పని చేశావమ్మా?

నీ అల్లుడు డబ్బు దాహం పట్టి నన్ను వేధిస్తుంటే ఆ హింసని భరించలేక తాళి తెంచి వాడిముఖాన కొట్టి నేను నీదగ్గరకొచ్చినపుడూ,

మన బంధుమిత్రులంతా నాదే తప్పనీ, వాడెంత హింస పెట్టినా మొగుడు కాబట్టి ఓర్చుకోవాలనీ నాకు బోధించినపుడూ, నీమొగుడు మనిద్దర్నీ బయటికి నెట్టేసి తలుపేసు కున్నపుడూ, అప్పుడెప్పుడూ రాని కోపం ఇప్పుడెందుకొచ్చిందమ్మా నీకు?

నీ జీవితమంతా బాధల జలపాతాలే కదమ్మా?

ఒకే ఒక్క భ్రాంతితో బతుకుతున్న నిన్నూ, జీవితంతో పోరాడుతున్న నన్నూ ఎప్పడో బహిష్కరించింది కదమ్మా ఈ లోకం. మనమూ అలాగే చేశాం కదా!అదే భావంతో అలాగే గట్టిగా నిలబడుంటే కాలం గడిచి పోయేది కదమ్మా!

జీవిత పార్శ్వాల్లో నిన్ను అనేక సార్లు నానా గడ్డీ కరిపించి ఇప్పుడు నువ్వెళ్లిపోగానే ముచ్చులా నీ శవం పక్కన కూర్చుని ఎట్లా ఏడుస్తున్నాడో...

నిజమే మరి! నువ్వు లేకపోతే ఎట్లా గడుస్తుందతడికి?

చకచకా తిరిగి ఇంటినంతటినీ చక్కబెట్టేదానివి.

బాధ్యతలన్నీ నీ నెత్తినేసుకుని,హక్కుల్ని మాత్రం అతడికి అప్పగించిన దానివి.

ఇంటి నాలుగు మూలలా నాలుగు రూపాలై విస్తరించిన దానివి.

అయ్యో అమ్మా! నిన్న ఈ పాటికి నువ్వు హాయిగా ఇంట్లో తిరుగుతున్నావే? ఆ క్షణం ఒక్కటీ అట్లా గడిచిపోయుంటే ఎంత బావుండేది?

కేవలం కాఫీలో కొంచెం చక్కెర తక్కువయినందుకు, అతడితో చచ్చేట్లు తన్నులు తింటూంటే ఎందుకమ్మా నీ బతుకు ఎందులోనయినా దూకి చావరాదూ? అన్నాను కోపంతో.

అంతే నా మాట మీరలేదు నువ్వు.

అయ్యో నా నోట్లోంచి ఆ మాటెందుకొచ్చిందో, నా నాలుక మీద ఏ శని ఆడిందో.

అంతా నాదురదృష్టం నా ఖర్మ... నాకింకెవరున్నారమ్మా?

తాగొచ్చి నీ మొగుడూ, ముండలతో నా మొగుడూ గడుపుతుంటే నన్ను దేవతలా గుండెల్లో దాచుకున్నావే!

ఇప్పుడెవరున్నారమ్మా నాకు తోడు?

అమ్మా! నువ్వసలు నిజంగా చచ్చిపోయావా? కళ్లు మూసుకుని నిద్ర నటిస్తున్నావా? లేదు లేదమ్మా నువ్వు చచ్చిపోలేదు. నువ్వింకా చచ్చిపోలేదు గదూ!

"నిత్యా కాఫీ తాగమ్మా"

"నిత్యా పాపకి పాలు పట్టావా ?"

"నిత్యా పాపకి స్నానం చేయించనా ? "

"నిత్యా...నిత్యా ....నిత్యా" అంటూ ఎప్పట్లా ప్రేమగా పిలుస్తున్నట్లే వుందమ్మా. ఇంక నన్నెవరు పిలుస్తారమ్మా.. అట్లా నోరారా... అమ్మా నాకు నువ్వు కావాలమ్మా.. వచ్చేయమ్మా ప్లీజ్ నన్ను క్షమించి వచ్చేయమ్మా.

"అమ్మ కావాలి. నాకు అమ్మకావాలి" పైకే ఏడుస్తున్నానేమో!

"నిత్యా ఏమిటిది చిన్న పిల్లలా? అమ్మ యికరాదు. నువ్వు నిజంగా దురదృష్టవంతు రాలివే" అంటూ దుంఖాన్ని ఆపుకోవడం కోసం పైట చెంగు నోట్లో దోపుకుంది శకుంతల పిన్ని. ఆ తరువాత నన్ను దగ్గరికి తీసుకున్నట్టుంది.

"పిన్నీ చూశావా అమ్మ ఎంత పని చేసిందో? అయ్యో పిన్నీ అమ్మని నేనే చంపేశాను. మీ అక్కని నేనే చంపేశాను. పిన్నీ అమ్మకెంత దయలేదో చూశావా? నన్నొంటరి దాన్ని చేసి వెళ్ళిపోయింది నేనొంటరిదాన్ని, ఒంటరిదాన్ని ఇక నాకెవ్వరూ లేరు."

పిచ్చిపట్టిన దానిలా బావురుమన్నాను.

"అమ్మా నిత్యా... నిత్యా నా తల్లీ నిత్యమ్మా... ఏడవబోకమ్మా! నీకు నేనున్నాగా...అమ్మ లేకపోతేనేం? నేను లేనూ?" మా నాన్న నన్ను దగ్గరికి తీసుకుని అందరూ చూసేలా ఓదారు స్తున్నారు. రెండు కాళ్ళు, రెండు చేతులున్న మృగమేదో నన్ను కావలించుకున్నట్లుగా అయి విసురుగా విదిలించేశాను.

మనిషా వీడు? మనిషంటేనే అర్థం మారిపోయింది. మనిషంటే ఇప్పుడు పైకి నిగ నిగలాడుతూ, లోపల కంపుకొడుతున్న కోడిగుడ్డు. మనిషంటే ఇప్పుడు జడలు విరబోసుకున్న దయ్యం.... మనిషంటే ఇప్పుడు రెండు కొమ్ములూ, కోరలూ వున్న మృగం...

మానాన్న మళ్ళీ నన్ను దగ్గరికి తీసుకుని తల నిమురుతున్నాడు. నా తల్లిని చంపేసిన హంతకుడు. నరరూప రాక్షసుడు.

చిత్రంగా అతడి కళ్లల్లో నుండి నీళ్లు.

పరిణామ క్రమంలో మృగం మనిషిగా మారడానికి వేల సంవత్సరాలు పట్టిందట. అయితే ఈ ఒక్క శతాబ్దపు చివరి దశలోనే మనిషి మళ్లీ మృగంలా మారిపోయాడు. జంతువు.... మృగం.. క్రూరమృగం.. పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొడ్తూ చూశాను.

అంతా విస్తుపోయి నాకేసి చూస్తున్నారెందుకూ!

నాన్న తలకి రెండు కొమ్ములూ, నోట్లోంచి రెండు కోరలూ వచ్చి అదేదో టివి యాడ్ లోలా వున్నాడు.

నాకు ఒళ్లు జలదరిస్తోంది . కళ్లు తిరుగుతున్నాయి. ఏడుపొస్తోంది .... నవ్వు కూడా వస్తోంది. ఈ నా పరిస్థితిని ఎలా సమీక్షించుకోవాలో తెలీని దానిలా కళ్లు మూసుకుని వెనక్కి గోడకి జారగిలబడ్డాను.

మనిషి ముందుకు నడుస్తున్నాడా? వెనక్కి నడుస్తున్నాడా? కాలమానం మనం ముందుకు నడుస్తున్నట్లు సూచిస్తూ నూతన సహస్రాబ్దిలోనికి అడుగు పెట్టింది. మనిషి ఈ స్థితికి చేరుకోవడానికి ఎన్ని వేల మైలురాళ్లు దాటి వచ్చాడు!

ఓ 'ఆడమ్' నువ్వు ఒక్కొక్క మెట్టూ ఎక్కుకుంటూ కీర్తి శిఖిలాలనధిగమించావు. ఆకాశాన్ని అందుకున్నావు. చివరికి సృష్టికి ప్రతిసృష్టి చేసే క్లోనింగ్ బ్రహ్మవయ్యావు. బాగానే వుంది. అయితే 'ఈవ్'ని మాత్రం నీతోపాటు చేయిపట్టి నడిపించకుండా దారిలోనే నిర్దాక్షిణ్యంగా వదిలేశావు. ఎదగనీయకుండా నొక్కి తొక్కి పారేశావు.

ఆడమ్ ఫస్ట్ సిటిజన్... ఈవ్ సెకండ్ సిటిజన్. విశ్వమంతటా ఇదే కథ!

ఓ నా ఈవ్ ఎక్కడున్నావమ్మా! పడుతూ లేస్తూ ఎక్కడాగిపోయావ్?

ఈ జీవితారణ్యంలో నీ కాళ్లకి మాత్రమే ముళ్లు గుచ్చుకున్నాయా?

గండశిలలడ్డం పడ్డాయా?

మాయమాటలు చెప్పి ఏ కొండ శిఖరం మీది నుండి తోసేశాడు నిన్ను ఆడమ్.

నువ్వు పతివ్రతవి కాదని చాకలోడెవరో అంటే అరణ్యానికి తోలేశాడా?

శీలపరీక్ష పేరిట అగ్ని స్నానాలు చేయించాడా?

అప్పులు తీర్చుకోవడం కోసం నిన్ను నడివీధిలో నిలబెట్టి అమ్మేశాడా?

రాత్రికి రాత్రి నిన్నొదిలి పెట్టేసి లోకాన్నుద్ధరించడం కోసం చెప్పా పెట్టకుండా వెళ్లి పోయాడా?

విచ్చుకత్తుల వంతెనల పహారా కాశాడా?

అర్థం పర్థం లేని ఆవేశంతో నిన్ను నడిబజారులో వివస్త్రను చేశాడా.

బిడ్డ పాలను నీరొమ్ముల్నుండి పిండి తీశాడా?

నువ్వు ప్రేమించనన్నావని క్లాసు రూములో కొచ్చి కత్తితో నరికేశాడా?

నవ్వుతూ నవ్వుతూ కాఫీలో నిద్రమాత్రలు కలిపిచ్చాడా?

సందడి, చప్పుడు లేకుండా గ్యాస్‌నాబ్ తిప్పేశాడా?

కిరసనాయిలు డబ్బా ఖాళీ చేశాడా?

కాఫీలో చక్కెర తక్కువయిందని కొట్టి చంపేశాడా? లేక అత్తింటివారి గొంతెమ్మ కోర్కెలు తీర్చలేక. పుట్టింటి వారికి భారం కాలేక నువ్వే ఆత్మహత్యే శరణమనుకున్నావా?

ఓ నా ఈవ్ ఎక్కడున్నావమ్మా?

ఎక్కడో లోయల్లో, కొండల్లో కోనల్లో ఈవ్ ఈవ్ నువ్వెందుకట్లా వెనకబడి పోయావ్? ఆడమ్ తినకుండా ఆ పండు నువ్వు మాత్రమే ఎందుకు తిన్నావమ్మా!

ఎక్కడో ఒక ఈవ్ పైలట్ అవుతుంది. మరోచోట ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కుతుంది.

ఇంకొక ఈవ్ అంతరిక్షంలోకి వెళ్తుంది. మరోచోట భారతరత్న పొందుతుంది.

అంతా చంకలు గుద్దుకుంటాం. అంతేగానీ మిగిలిన తొంభయితొమ్మిది శాతం, మనసులో రగులుతున్న ఆలోచనల సంఘర్షణని బయటపెట్టలేక అట్టడుగు స్థితిలో హింస పడుతున్నారన్న సంగతి గుర్తించం.

హయ్యో! కొత్త శతాబ్దిలోనయినా నువ్వు ఆడమ్‌తో సమానంగా నడుస్తావా? ఇంకా ఎప్పటికి తల్లీ నువ్వు ప్రశ్నించడం నేర్చునేది?

"ఏదో పాపం. హఠాత్తుగా వాళ్లమ్మ చనిపోవడంతో నిత్యకి మెంటల్ షాకయిపోయింది"

"షాకా... పిచ్చిపట్టేసినట్లుంది... ఏదేదో మాట్లాడుతోంది."

"కొడుక్కి చెప్పారా లేదా? కొడుకొచ్చేదాకా వుంచేస్తారా? ఇప్పటికే చూడు ఎట్లా అయిపోతోందో బాడీ. మామూలు చావుకాకపాయె! ప్చ్...." రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"అయినా ఈ వయసులో ఈ పని చేసుండాల్సింది కాదు. బిడ్డ మొహమయినా చూసుండాల్సింది."

హయ్యో! ఇప్పుడు కూడా అమ్మనే తిడుతున్నారు అంతా. నేనేం చేయాలి?

పోగొట్టుకున్న జీవితాన్ని ఉదయం నుండీ వెతుకుతూనే వున్నాను. సాయంత్రానిగ్గాని చెప్పలేను నా నిర్ణయమేంటో...

"నిత్యా... నిత్యా..."

"నిత్యా... ఇక లేమ్మా. అమ్మ కాళ్లకి దణ్ణం పెట్టుకో" పిలుస్తున్నారెవరో.

భయం....భయంగా కళ్లు విప్పాను.

అప్పటికే జీవం లేని అమ్మ శరీరాన్ని వాకిట్లోకి పట్టేశారు. అంతే! ఆ గుక్కెడు పోతే వీధిలోకి ఈడ్చి పారేస్తారు. ఒక్క రోజు కూడా ఇంట్లో వుంచుకోరంతే.

నాన్న ఏడుస్తున్నాడు. అది నిజమైన ఏడుపో లేక అంతా తనని నిందిస్తారని దొంగేడుపేస్తున్నాడో!

అమ్మకి తల కొరివి పెట్టడం కోసం సిద్ధమవుతున్నాడతడు... ఇప్పుడు కొత్తగా పెట్టేదేముంది. ఎప్పుడో పెట్టేశాడు కదా.

తడి తలా, తడిసిన పంచెతో ఒంటిమీద చొక్కా లేకుండా మెడలో తెల్ల పీలికలాంటి జంధ్యం వేసుకుని దిగాలుగా ఏడుస్తూ ఒంగి అమ్మ మెడలో తాళి కడ్తున్నాడు.

"అయ్యయ్యో! ఒకసారి కట్టిన ఉరితాడు చాలదా? ఇప్పుడు మళ్ళీ శ్మశానంలో కూడా అమ్మని ప్రశాంతంగా బతకనివ్వరా?"

ఏడుస్తున్నానో లేదో నాకే తెలీడం లేదు. అంతా నన్ను లేవదీసి అమ్మ వద్దకు తీసుకు వెళ్లారు.

అమ్మ గుడిలోని అమ్మవారిలా అలంకరింపబడి వుంది.

మొహానికి పచ్చగా పసుపు రాశారు. నుదుటి మీద పెద్ద కుంకం బొట్టు పెట్టారు. పూలమాలలు వేశారు. బండెడు పసుపూ, కుంకం అంటే ఇదేనా? హయ్యో! బతికున్నపుడు లేని అలంకారాలు, అపుడు లేని గౌరవాభిమానాలూ ఇప్పుడు ఎన్ని పూలమాలలేస్తే మాత్రం అమ్మకేం తెలుస్తుందీ?

జీవించి వున్నపుడు లేని అస్థిత్వం ఇప్పుడెందుకు?

నేను కళ్ళు మూసుకున్నాను. అమ్మని ఆ స్థితిలో చూడలేక.... కానీ ఈవ్ నా కళ్లముందు ప్రత్యక్షమయింది.

అయ్యో! ఈవ్ ఎన్నిసార్లిలా శ్మశానానికి తరలించబడ్తావ్ బలవంతంగా.

మొదటిసారి చనిపోయినపుడే బాధంతా, తపనంతా, ఆ తర్వాత ప్రతీసారి అది యాంత్రికమయిపోతుంది. చాలా మామూలు విషయమైపోతుంది. ఇలా ఆత్మ మళ్లీ మళ్లీ నీ ఆత్మహత్యలు (?) చూసి చూసీ పేపర్లో చదివి చదివీ అలవాటయిపోయిందీ సమాజానికి ఇలా ఎన్నెన్ని సార్లు వెనక్కి వెళ్ళి వెళ్లి నువ్వు ఆడమ్‌ని కలుసుకోలేక పోయావో? ఎద్దేవాలకు గురవయ్యావో భూమిలోకి అణగదొక్కబడ్డావో! మట్టిలోకి తొక్కబడ్డ విత్తనమెక్కడయినా చచ్చిపోతుందా? లేదు లేదు.. నా తల్లి ఈవ్ మళ్లీ మొలకెత్తుతుంది.

తను కూడా మీబోటి మనిషేనని చాటి, తనలోని లక్ష ఆలోచనల సంఘర్షణని బయటపెట్టి, ఆకసపు చిట్ట చివరి అంచుదాకా స్వేచ్ఛను విస్తరిస్తుంది.

అయితే అమ్మా!

ఈసారి వస్తూ వస్తూ చేతిలో ఆయుధంతో సహా రావడం మాత్రం మర్చిపోకు. లేదంటే నువ్వు ఎందుకూ పనికిరావు, బానిసగా తప్ప! ఆయుధమే నీకు అండ!

చేజారిపోయిన జీవితాన్ని వెతికి పట్టుకోవడం కోసం, అమ్మా, నువ్వు మళ్లీ పుడ్తావు. పుడ్తూ పుడ్తూ అయస్కాంతం లాంటి ఆయుధాన్ని తీసుకొస్తావు. అప్పటిదాకా నీకోసం నీటిబొట్లు కార్చడానికి నా దగ్గర రెండు కళ్లున్నాయి. నీ గురించి ప్రార్థన చేయడానికి నాకు... నాకు నోరుంది.. నాలుక ఉంది ... ఉందమ్మా.. ఉంది!

విపుల, ఆగస్టు 2000